AUCHITHYAM
ISSN: 2583-4797
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

# 10. అమృతాంజనశతకం: అభివ్యక్తివైచిత్రి

**కరి యామినీకృష్ణ**
పరిశోధకురాలు, సంగీత & లలితకళల విభాగం,
శ్రీ పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం, తిరుపతి
సంగీత బోధకురాలు, ఆర్జీయూకేటీ శ్రీకాకుళం, ఆంధ్ర ప్రదేశ్.
సెల్: +91 9182860821. Email: kariyaaminikrishna@gmail.com

**ఆచార్య ఆర్.ఎస్.ఎస్. శైలేశ్వరి**
ఆచార్యులు మరియు శాఖాధ్యక్షులు,
సంగీతం మరియు లలితకళల విభాగం,
శ్రీపద్మావతి మహిళావిశ్వవిద్యాలయం, తిరుపతి
తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్: +91 9347326062. Email: dr.saileswari@gmail.com

Keywords: నారాయణాచార్యులు, అమృతాంజనశతకం, కాశీనాథుని నాగేశ్వరరావు, ఆంధ్రపత్రిక, ఆంధ్రగ్రంథమాల, శతకం.

## 1. ఉపోద్ఘాతం:

**“అమృతాంజనంబను నౌషధరత్నంబు, వాతశీతాదిక భంజనమ్ము... అతలుమై యిల విలసిల్లు నంజనంబు”** (రామానుజయ్య, బుక్కపట్టణము, ఆంధ్రప్రత్రిక ప్రమోదూత ఉగాది సంచిక, ప్రకటన పుట)

అంటూ వేనోళ్ళ కొనియాడబడిన వందలేళ్ళ నాటి ఔషధరాజం అమృతాంజనం.

**“వెంకట సుబ్బారావు, అనగా రెంటాల వెంకట సుబ్బారావు .... వీరు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారికి మేనమామ. అమృతాంజనవిద్య వారికి నేర్పినది వీరే అభిజ్ఞలోకము వాకొంటుంది.”**

అని (కన్యాశుల్కం నూరేళ్ళ సమాలోచనం గురజాడ అప్పారావు- కన్యాశుల్కము వ్యాసం పుట. 187.) నిడదవోలు వెంకటరావు అన్నారు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php



“అమృతాంజనం (ఆంగ్లం: Amrutanjan) అనునది నొప్పి నివారిణిగా వాడబడే ఔషధతైలం. ఇది అమృతాంజన్ హెల్త్ కేర్ అనే సంస్థకు చెందినది. అమృతాంజం పేరు అమృతం + అంజనం అనే రెండు తెలుగు పదాల కలయికతో ఏర్పడింది. అమృతాంజనం అనబడే ఈ ఔషధ తైలాన్ని 1893లో భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు అయిన కాశీనాథుని నాగేశ్వరరావు కనుగొన్నారు. ఈ ఔషధంతో ఆయన ప్రసిద్ధి చెందాడు. ఆయన సంగీత కచేరీలలో ఉచితంగా సరఫరా చేసేవారు. ప్రస్తుతం కూడా ఈ ఔషధం ప్రసిద్ధి పొందినది. అమృతాంజన్ లిమిటెడ్ గా 1936లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా రూపుదిద్దుకొన్నది. ఈ ఔషధాన్ని తలనొప్పికి ఎక్కువగా వాడుతారు. ఇది ప్రస్తుతం శంభుప్రసాద్ (కాశీనాధుని నాగేశ్వరరావు గారి మనుమడు) చే నిర్వహింపబడుతున్నది.” (తెలుగు వికీపీడియా 01.01.2023) **(చిత్రము: ఆంధ్రపత్రిక, సంపుటం 20 ప్రమోదూత సంవత్సరాది సంచిక. పుట. 48 ప్రకటనల్లో).**

## 2. శతకకర్త పరిచయం:

‘కవితావతంస’, ‘గానకళానిపుణ’, ‘హరికథాచతురనాన’ శ్రీమన్ కరినారాయణాచార్య భాగవతార్ రామతీర్థ క్షేత్రం, విజయనగరం జిల్లా నివాసి. శ్రీరామతీర్థం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ రామతీర్థ క్షేత్రం. చాలా మంది గొప్ప సంస్కృత కవులు, పండితులు మరియు గొప్ప కర్ణాటక సంగీతకారులు ఈ ప్రదేశం నుండి వచ్చారు.

శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ "కరి" వంశానికి ఒక కిరీటం. వీరు విజయనగరం జిల్లాలోని రామతీర్థక్షేత్రంలో “గాన పండిత్”గా తన నైపుణ్యాన్ని నిరూపించుకోవడమే కాకుండా పదవీ విరమణ తరవాత కూడా సింహాచలదేవస్థానంచే “ఆస్థాన విద్వాన్” గా నియమింపబడి తన గాత్రంతో రచనలతో ఎంతో సంగీతసేవ చేసారు . వీరు ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోని అన్ని ఇతర ప్రదేశాలలో అనేక సంగీతకచేరీలు, హరికథాకాలక్షేపం కూడా చేయటంలో సుప్రసిద్ధులు. 1963లో విజయనగరం వాణి ప్రెస్ ద్వారా ఆయన కుమారుడు శ్రీ కన్నసామి ప్రచురించిన “శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ షష్ట్యబ్ది పూర్తి సంచిక” అనే పత్రికలో శ్రీ ధనకుధరం వరదాచార్యులు రాసిన వ్యాసంలో ఆయనను “ఆంధ్రరత్న” అని సంబోధించారు.

శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ 1903 జనవరి 23వ తేదీన ఏకాదశితిథి నాడు ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని బొబ్బిలి సమీపంలోని రాజయ్యపేటలో జన్మించారు. వీరు అనురాధ నక్షత్రంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు కందాళ వెంకటేశ్వర్లు, శ్రీమతి కందాళ లక్ష్మీ నరసమ్మ. శ్రీ కరి నారాయణాచార్యుల పూర్వీకులు బొబ్బిలి రాజవంశానికి ఆధ్యాత్మిక గురువులు. వీరు సంస్కృత, తెలుగు సాహిత్యాలు, సంగీతములలో విశేషమైన వైదుష్యము కలవారు. నారాయణాచార్యభాగవతార్ విద్యాభ్యాసం విజయనగరంలోని సంస్కృతకళాశాలలో జరిగినది. వీరు ఆ కళాశాల నుండి “ఉభయభాషాప్రవీణులు”. వీరికి చిన్నతనములోనే

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

అధ్యాత్మిక గ్రంధములు కూడా అభ్యసించే అవకాశం కలగడంతో వీరు "ఉభయవేదాంతప్రవీణులు"గా కూడా ప్రావీణ్యత పొందారు. అప్పటికి నారాయణాచార్యుల వయస్సు కేవలం ఇరవై సంవత్సరములు మాత్రమే.

భాగవతార్ అనేక సాహిత్య రచనలు, సంగీతంలో కీర్తనలు చేస్తూనే హరికథాకాలక్షేపాలు కూడా చెప్పేవారు. వీరు 1952లో "శ్రీ యతిరాజ సేవా మహిళా మండలి" వారి ద్వితీయ వార్షిక పండిత సభలలో చెప్పిన "గోదా కళ్యాణం" హరికథా కాలక్షేపం ఎంతగానో ప్రజాదరణ పొంది, తరువాత ఎన్నో పండిత సభలలో వీరి హరికథలను ఏర్పాటు చెయ్యటానికి దోహద పడింది. భాగవతార్ పద్యరచనలలో "అమృతాంజనశతకం" కాశీనాధుని నాగేశ్వరరావు మన్ననలను పొందినది. వీరి ఇతర రచనలు శ్రీ రామానుజ గురువరణం, సుధన్వుడు, స్వాహాశశాంకము మున్నగు నాటికలు, అనేక చాటువులు, గేయ ప్రబంధములు, హరికథలు. ఇవి ఆంధ్రదేశములో విశేషమైన ఖ్యాతి గడించినవి.

### 3. శతకరచనానేపథ్యం- ప్రచురణ:

కాశీనాధుని నాగేశ్వరరావు ఆంధ్రగ్రంథమాల అనే సంస్థను నడుపుతూ ఎన్నో సాహిత్యాత్మక గ్రంథాలను ముద్రిస్తూ ఉండేవారని, కవిరచయితలను పోషిస్తూ ఉండేవారని లభ్యమైన ఆధారాల ద్వారా తెలుస్తున్నది. కాశీనాధుని వారికి సమకాలికులు, సంగీత సాహిత్యాలలో అపారమైన ప్రతిభాపాండిత్యాలున్న నారాణాయణాచార్యులు నాగేశ్వరరావుకు అంత్యంత సన్నిహితులు కావడం వల్ల, వారి అభిమాన ఉత్పత్తి అయిన అమృతాంజనానికి ప్రాచుర్యం కల్పించడానికే ఈ శతకం వెలుగు చూసినట్టు ప్రకటనలద్వారా, శతకంలో అక్కడక్కడా పేర్కొన్న విషయాల ద్వారా అవగతం అవుతోంది. భారతి, ఆంధ్రపత్రిక, చందమామ, ఆంధ్రమహిళ మొదలైన అలనాటి పత్రికనిండా ప్రతి సంచికలోను అమృతాంజం ప్రకటనలు చూడవచ్చు. 1932లో వచ్చిన పత్రికల్లో అమృతాంజనం ప్రకటనతో పాటు అమృతాంజనశతకం-వెల ఒక అణా అని ప్రచురించడాన్ని బట్టి, ఈ శతకం కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకునేందుకు ఒకమంచి ఉపకరణంగా ఉండేదని బోధపడుతుంది. (ANDHRAPATRIKA Volume 19, issue 222, Publication date 1932-12-2 & Volume 20, issue 4, Publication date 1933-04-05)

ఈ శతకముఖచిత్రము దొరకడంలేదు కానీ శీర్షిక పుటలో అమృతాంజనశతకము, కర్త: శ్రీమాన్ కరి నారాయణాచార్యుడు (ఆంధ్రగీర్వాణసాహిత్యపరిషత్తు) అని ఉంది. ప్రకాశకులుగా కాశీనాధుని నాగేశ్వరరావని కనిపిస్తోంది. ఆంధ్రగ్రంథమాల ప్రచురణగా1932 (ఆంగీరస)లో చెన్నపురిలో ముద్రితమైనట్టు, వెల ౦-౧-౦ ఒక అణా అని ఉటంకించడాన్ని గమనించవచ్చు. (అమృతాంజనశతకము, ముఖచిత్రం)

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు శతకమంజరిని ప్రచురించి ఎన్నో శతకాలను సంకలనం చేసి ప్రచురించారు కానీ ఆయా భాగాలలో ఎక్కడా అమృతాంజనశతకము కనిపించలేదు. కేవలం అమృతాంజనం ప్రచారానికి, అమృతాంజనంతో పాటు విక్రయించడానికి నాగేశ్వరరావుపంతులు ఈ లఘుశతకాన్ని ముద్రించి ఉండవచ్చు. (శతకమంజరి, కాశీనాథుని నాగేశ్వరరావు.)

అమృతాంజనము, అమృతాంజనశతక ఆవిర్భావాల గురించి శతకసౌరభంలో డా. కె. గోపాలకృష్ణారావుగారి మాటలు అవశ్యం గమనించదగ్గవి. "**వస్తువు బంగారం వంటిది. ప్రచారసాధనాలు దానికి సౌరభాన్ని చేకూర్చినాయి. ఈ ఔషధ ప్రశస్తిని కర పత్రములు, పత్రికా ప్రకటనలు నానావిధాలుగ చాటినవి. దీనికితోడుగ వ్యాపార ప్రకటనం కార్యరూపంలో అందులోను శతకరూపంలో సాగటం శతకవాఙ్మయానికి అలంకారప్రాయమైంది.**" (శతకసౌరభం పుట. 45)

## 4. కృతిసమర్పణ:

ఈ శతకంలో తొలిపుటలో 'కృతిసమర్పణము' అనే శీర్షికతో రెండు పద్యాలున్నాయి. ఒకటి కందపద్యం. మరొకటి తేటగీతితో కూడిన సీసపద్యం. ఇందులో నాగేశ్వరరావు పంతుల్ని ఆశీఃపురస్సరంగా ప్రస్తుతించిన విధానం రసరమ్యంగా ఉంది.

"**శ్రీశ పదకమల భక్తుడు / దేశోద్ధారకుడు బహుసుధీగణ్యుండున్**
**కాశీనాథాన్వయ నా/ గేశుడు సుఖియగుత మహి నహీనవిభవుడై.**" (కృతిసమర్పణము)

విష్ణుభక్తుడు, దేశోద్ధారకుడు, పండితాగ్రేసరుడైన నాగేశ్వరుడు అమితమైన వైభవంతో సుఖించుగాక అని ఆశీస్సులందిస్తూ ఈ కృతిసమర్పణం ప్రారంభమైంది. కవిపోషకులకు కావ్యాలు రాసి అంకితమివ్వడం పూర్వంనుండి వస్తున్న సంప్రదాయం. "**కాశినాగేశ్వరాబ్ధి హిమమరీచికి, గుణికి, నాగేశ్వరాఖ్యకృతికి నీకృతి భక్తి నంకిత మొనర్తు జంద్రునకు నూలిపోగను సామెతగను**" అంటూ ఈ శతకకర్తకూడా కృతిభర్తగా శతకవస్తువైన అమృతాంజనసృష్టికర్త, ఆ సంస్థ అధినేత అయిన కాశీనాథుని వారికే ఈ శతకాన్ని సమర్పించడం ఎంతో ఔచితీమంతంగా ఉంది.

## 5. అమృతాంజనశతకం- వైశిష్ట్యం:

లభ్యమౌతున్న శతకాలలో అమృతాంజనశతకం విలక్షణమైంది. గడిచిన తొంభై ఏళ్ళలో ఈ శతకాన్ని సమీక్షించిన వారు, విశేషంగా వ్యాఖ్యానించిన వారు, సమగ్రంగా పరిశీలించినవారు లేరేలేరని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఒకరిద్దరు కేవలం పరిచయాత్మకంగా మాత్రమే ఈ శతకవైశిష్ట్యాన్ని స్పృశించిన దాఖలాలు శతకవాఙ్మయం సంకలన, విమర్శన గ్రంథాలలో కనిపిస్తున్నాయి.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

"వస్తు వైలక్షణ్యము బట్టి అమృతాంజనశతకము ప్రత్యేకముగ పరిశీలింపదగినది."(దేవులపల్లి శేష భార్గవి, శతకసాహిత్యం-2)

" 'ఆంధ్రపత్రికతోడ అమృతాంజనం బిచ్చి తలనొప్పి బాపిన ధన్యుడితడు' అని కీర్తిని గడించిన కాశీనాథుని నాగేశ్వరరావు గారి సృష్టి "అమృతాంజనము" అనే నొప్పి నివారిణి మందు. దీనిపై ఒక ప్రత్యేక శతకమే వెలుగుచూచింది. అనేక చమత్కారాలు పొదగబడిన ఈ శతకంలో పలుచోట్ల హాస్యం తొంగిచూస్తున్నది. వస్తువుకు ప్రాచుర్యం కల్గించే ప్రకటనలవలె కాకుండా ఒక విశిష్టతను సంతరించుకున్న హాస్యశతకం ఇది. వరవర్ణవిలసిత మగు సురుచిర పాకాంచితగుణ శోభితమగుచున్ సరస మగుట నిన్ను మనో హర కావ్యమనంగవలయు నమృతాంజనమా ! అని అమృతాంజనాన్ని ఒక మనోహర కావ్య సదృశంగా కవి వర్ణించాడు. శబ్ద చమత్కారాన్ని ఆశ్రయించి ఈ విషయాన్ని సాధించాడు. వర్ణము, పాకము, రసము వంటి కావ్యసామగ్రిని అమృతాంజనమునకు ఆపాదించి పోలిక చెప్పిన చోట కనిపించిన సునిశిత హాస్యం ఈ శతకంలో పలుతావులలో ప్రకటమవుతుంది." (ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువడిన గ్రంథాలు, గిరిజామనోహరబాబు, జి. తెలుగుశతకాలు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్, 2012. పుట. 30)

"శతకసౌరభం"లో శ్రీ గోపాలకృష్ణారావు పేర్కొన్న అంశాలు ఈ శతకవైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి. "కరి నారాయణాచార్యులుగారు "అమృతాంజనము"నకు సంబంధించిన అనేకాంశములకు కావ్యగౌరవము కలిగించినారు. సువర్ణముతో నొప్పు అంజనము-అందమైన చిన్నసీసా, మూత, పేటిక, వివిధ భాషలలో గల ఔషధ గుణకీర్తన పత్రము, మొదలగు వానిని నారాయణాచార్యకవి మనోహరములగు కల్పనలతో వర్ణించిన శతకమే "అమృతాంజన శతకము". ఈ శతకము కేవలము ప్రచారగ్రంధముకాదు. మనోజ్ఞమైన కావ్యం. అమృతాంజనము కూడ హృద్యమైన కావ్యమువంటిదని కవి ఈ పద్యంలో వివరించిన రీతి గమనించండి. నన్నెచోడాదులు హృద్యకావ్యమును శ్లేషకల్పనలతో వర్ణించినట్లున్నది. ఇంపైన కావ్యమువలె అమృతాంజనము కరవర్ణము సురుచిర పాకముతో సరసమైనదని నారాయణాచార్య కవి ప్రస్తుతించినారు." (శతకసౌరభం పుట. 45)

ఈ ఒకటి రెండు ఉదాహరణలు తప్ప, ఇతమిత్థంగా ఈ శతకవైభవాన్ని పట్టిచూపించిన రసజ్ఞులు, చమత్కారప్రియులు కానరారు.

### 6. అమృతాంజనశతకం- అభివ్యక్తివైచిత్రి:

ఈ శతకంలో ఎన్నో రకాల చమత్కారాలు కొల్లుతీరి ఉన్నాయి. నారాయణాచార్యులవారి భాషాపటిమ, పాండితీ ప్రకర్ష, వర్ణనావైదుష్యం, అభివ్యక్తి వైచిత్రి ఈ శతకంలో ప్రతిపద్యంలోనూ ద్యోతకమవడాన్ని గమనించవచ్చు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

### 6.1 ఉక్తివైచిత్రి:

చమత్కారమైన మాటనే ఉక్తివైచిత్రిగా పేర్కొనవచ్చు. వక్రోక్తిగా, వాక్ప్రౌఢిగా ఈ తరహా రచనాపాటవాన్ని ప్రాచీనులు పేర్కొన్నారు. నారాయణాచార్యుల వారి శతకపద్యరచనలో అనేకసందర్భాలలో ఈ ఉక్తివైచిత్రి తొణికిసలాడుతూ సహృదయానందకరంగా ఉంటుంది.

ఈశతకం రచనాప్రణాళికలోనే అసలైన ఉక్తివైచిత్రి ప్రకటితమౌతోందని చెప్పవచ్చు. కవి- శతకవస్తువైన అమృతాంజనంతోనే సరిసరి సంభాషించడం ఈ రచనలో విశేషం. ప్రతిపద్యంలో మకుటం “అమృతాంజనమా” అన్న సంబోధన. ఒక అచేతనమైన పదార్థానికి చేతనత్వాన్ని ఆపాదించి, అమృతాంజనానికి మానవీయతను ఆరోపించడం, మధ్యమపురుషలో ప్రతిపద్యాన్ని రచిస్తూ, సంబోధనాత్మక అమృతాంజనంతోనే సంభాషించడం ఎంతో అరుదైన, విలక్షణమైన నాటకీయతగా పేర్కొనవచ్చు.

**కం. శ్రీచారుముఖీకమన/ ప్రాచుర్యకృపాకటాక్షభాగ్యంబున నీ**

**భూచక్రమున సమృద్ధిగ/నాచంద్రార్కముగ వఱలు మమృతాంజనమా! 1**

శ్రీ మహాలక్ష్మీ దేవి అందమైన ముఖం వలన ఎంతో కృపాకటాక్ష భాగ్యాన్ని పొందినదై ఈ భూమ్మీద సమృద్ధిగా, శాశ్వతంగా "అమృతాంజనం" ఉండుగాక అని మొదటి పద్యంలోనే శ్రీకరి వారు ఆశీర్వాదాత్మకంగా అమృతాంజనాన్ని ఆచంద్రతారార్కం నిలిచి ఉండమని దీవించారు.

**కం. వెన్నుడు, లచ్చియు మొదలుగ,/ బన్నిద్దరు సూరు, లుడయవరు, లితరార్యుల్**

**సన్నుతులగు వైష్ణవ గురు/ లన్నన్ స్మరణీయులెపుడు నమృతాంజనమా! 2**

ఓ అమృతాంజనమా! విష్ణుమూర్తి, లక్ష్మీదేవి మొదలు, 12మంది ఆళ్వారులు, సాక్షాత్తు శ్రీరంగనాథుడే "ఉడయవర" అని పిలవగా ప్రసిద్ధులైన భగవత్ శ్రీమత్ రామానుజాచార్యులు, ఇంకా మిగతా పూజ్యులు, స్తుతించ దగిన వైష్ణవ గురువులు ఎప్పుడూ స్మరణీయులే అని వైష్ణవపరివార వర్ణనం వీరి సంప్రదాయవైదగ్ధ్యానికి ప్రతీక.

ఆచార్యులవారు గురుపరంపరను, సంస్కృత-తెలుగు పూర్వకవులను స్తుతించడం, కుకవినింద గావించడంలో చక్కని వాక్చమత్కృతిని గమనించవచ్చు.

**కం. శ్రీ మన్ముడుంబకులజుని, / ధీమహితుని సింహగిరి సుదేశికవరునిన్**

**నా మనమునందు సంతత/ మామోదముతో భజింతు నమృతాంజనమా! 3**

“ఓ అమృతాంజనమా! ధీశాలియైన శ్రీ ముడుంబ సింహగిరి స్వామి (ఆధ్యాత్మిక గురువు, రామతీర్థం క్షేత్రం, విజయనగరం) వారిని నా మనసులో ఎంతో ప్రత్యేకంగా ఎప్పుడూ భజిస్తూ ఉంటాను” అంటూ గురువందనం చేసారు. ఇందులో వినయోక్తి స్పష్టం.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

**కం. నాకుభవు, వ్యాసు, మాఘుని, / శ్రీకాళీదాసు, బాణు, శ్రీహర్ష కవిన్**

**లోకజ్ఞు దండికవి న/ త్యాకృష్టాదృతి దలంతు నమృతాంజనమా! 4**

"ఓ అమృతాంజనమా! ఆదికవి వాల్మీకి మహర్షిని, వ్యాసుల వారిని, శిశుపాలవధ అనే కావ్యం వ్రాసిన మాఘకవిని, సంస్కృత పంచకావ్య కర్త, కవి కులగురువు, మహాకవి కాళిదాసును, కాదంబరి కర్త భట్టబాణుణ్ణి, నైషధీయచరిత్ర వ్రాసిన శ్రీహర్షుణ్ణి, దశకుమార చరిత్రాది రచనలతో ప్రసిద్ధుడైన దండ్యాచార్యుణ్ణి ఎంతో ఆదరంతో తలుచుకుంటూ నమస్కరిస్తున్నాను. (పూర్వకవులను స్తుతిస్తున్నారు. ముందుగా సంస్కృతంలో సుప్రసిద్ధులైన కవీంద్రులను స్మరిస్తున్నారు.)

**కం. నన్నయ దిక్కన నెఱ్ఱన/ జెన్నలరగ బోతనార్య శ్రీనాథకవిన్**

**సన్నుతు బెద్దన్నను ది / మ్మన్నను మది దలదు సతత మమృతాంజనమా!5**

"ఓ అమృతాంజనమా! తెలుగులో కవిత్రయంగా ప్రఖ్యాతులైన నన్నయ తిక్కన ఎర్రన కవులను, శ్రీమదాంధ్ర మహాభాగవతం కర్త పోతనామాత్యుణ్ణి, శృంగారనైషధం శివరాత్రి మహాత్మ్యం మొదలైన ఎన్నో కావ్యాలు రాసిన శ్రీనాథ మహాకవిని, ప్రబంధ యుగంలో మొట్టమొదట చెప్పుకోదగ్గ అల్లసాని పెద్దనను, పారిజాతాపహరణం వ్రాసిన నంది తిమ్మనను మనసారా తలుచుకుంటూ నమస్కరిస్తున్నాను." అన్నారు. కరివారికి తెలుగు సంస్కృతకవులపట్ల ఉన్న గౌరవాదులు ఈ పద్యాలలో వ్యక్తమౌతున్నాయి.

**కం. ఇలలో గల కవు లందఱు/ వలె గాక సమస్తమానవప్రియకర మౌ**

**సలలిత శతకము సహృదయు లలరగ నీపై నొనర్తు నమృతాంజనమా! 6**

"ఓ అమృతాంజనమా! లోకంలో ఎంతో మంది కవులు ఎన్నో విషయాలను కవితా వస్తువులుగా స్వీకరించి శతకాలు వ్రాశారు. కానీ నేను వాళ్ళ దారిలో కాకుండా, అందరికీ ఆనందాన్ని కలిగించేలా, సహృదయులు మెచ్చుకునే విధంగా నీ గురించి లలితమైన శతకాన్ని వ్రాస్తాను." అని శపథం చేసిన ఆచార్యుల మాటల్లో పౌఢోక్తిని ఉక్తివైచిత్రిగా గమనించవచ్చు.

## 6.2 భాషావైచిత్రి:

సంస్కృతాంధ్రాలలో విశేషమైన పాండిత్యమున్న కవివరేణ్యులు శ్రీ నారాయణాచార్యులు. ఉభయ భాషల ప్రావీణ్యం ఈ శతకరచనలో ఎన్నో సందర్భంలో మనకు సాక్షాత్కరిస్తుంది.

**కం. ఉరుదారుణశూలతమో గురుదారణకరణలసదకుంఠఖమణియన్/**

**బిరు దార్జింపందగు నీ కరుదా రుగ్రక్షకత్వ మమృతాంజనమా! 57**

వంటి పద్యాలలోని దీర్ఘసమాసాలు, సమాసఘటన వైశిష్ట్యం, ఓజోగుణగుంభనం కరి వారి భాషావైచిత్రి ని వెల్లడిస్తున్నాయి.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

కం. నడచుటకుఁ బూనినంతన గడేగడెకు మివుల నొవులుఁ గల్గించెడునె

క్కుడుకీళ్లనొప్పులను నీ వడఁతువు నిముసమ్ములోన నమృతాంజనమా! 62

అనే పద్యంలో అచ్చతెనుగు సొగసును కవి చవిచూపించిన తీరు లెస్సగా ఉంది.

### 6.3 వర్ణనావైచిత్రి:

కం. ఇల నతినిష్ఫలవర్ణన / ముల జేతురు కవులు న్యాయముం దలపకయే

లలి నిను వర్ణించుటయే యలఘుత రావశ్యమందు నమృతాంజనమా! 7

"ఓ అమృతాంజనమా! లోకంలో కవులెంతోమంది అనాలోచితంగా, ఎవరికీ ఉపయోగంలేని ఎన్నెన్నో వర్ణనలు చేస్తూ ఉంటారు. కానీ క్రమంగా నిన్ను వర్ణించడమే ఎంతో అవసరమైన, గొప్పదైన విషయంగా నేను భావిస్తాను." అని ఎందుకు అమృతాంజనాన్నే వర్ణించదలుచుకున్నారో ఆచార్యులవారు శతక ప్రారంభంలోనే పేర్కొన్నారు. అమృతాంజనం ప్రకటనల్లో కూడా విభిన్నవర్ణనలు, నూతనత్వం, అభివ్యక్తులను గమనించవచ్చు.

### 6.4 అలంకారవైచిత్రి:

వరవర్ణవిలసిత మగు సురుచిర పాకాంచితగుణ శోభితమగుచున్ సరస మగుట నిన్ను మనో హర కావ్యమనంగవలయు నమృతాంజనమా ! అని అమృతాంజనాన్ని ఒక మనోహర కావ్య సదృశంగా కవి వర్ణించాడు. శబ్ద చమత్కారాన్ని ఆశ్రయించి ఈ విషయాన్ని సాధించారు. వర్ణము, పాకము, రసము వంటి కావ్యసామగ్రిని అమృతాంజనమునకు ఆపాదించి పోలిక చెప్పిన తీరు ఈ శతక రచనలోని అలంకార వైచిత్రికి ఒక మచ్చుతునకగా భాసిస్తోంది.




### 6.5 అభివ్యక్తివైచిత్రి:

భావాన్ని రసరమ్యంగా మనోహరంగా వ్యక్తీకరించడంలో అభివ్యక్తివైచిత్రి ద్యోతకమౌతుంది. అమృతాంజనశతకంలో 26వ పద్యం నుండి వరసగా అనేకపద్యాలలో ఈ అభివ్యక్తివైచిత్రి, విశేష భావపరంపర, నూతనవ్యక్తీకరణలు, వర్ణనలుండడం ఈ శతకానికే మకుటాయమానమైన విషయం.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

**ఈ శతకంలో అభివైచిత్రి చోటుచేసుకున్న సందర్భాలకు కొన్ని ఉదాహరణలు:**

- ఓ అమృతాంజనమా! ఎన్నో ఔషధాలకు నిలయమైన చంద్రుడికి నీ గొప్పతనం తెలియదు. ఒకవేళ తెలుసుకున్నవాడే అయితే, రాహువు తనని పట్టుకుని విడిచిపెట్టినప్పడయ్యే గాయాలను సులభంగా మాన్పుకుని ఉండేవాడు కదా.
- ఓ అమృతాంజనమా! అన్ని వేళలా మూలాధారాది చక్రసమాహారమైన శరీరాలను రోగాల నుండి రక్షిస్తావు. మానవులందరి మనస్సులనే పద్మాలను రంజింప చేస్తావు. ఈ గుణాల చేత నిన్ను మిత్రుడు (సూర్య భగవానుడు) అని తలుస్తాను.
- ఓ అమృతాంజనమా! కొంతమంది తెలివి తక్కువ వారూ.. నకిలీ మందులమ్మే వారి మాటలు నమ్మి, పైపై మెరుగులకు భ్రమపడి వాటినే కొంటారు. వాటిలో నీ సుగుణాలేవీ ఉండవు కదా.
- ఓ అమృతాంజనమా! పారిజాతంలోని పూదేనను ఆస్వాదించే తుమ్మెద, ఉమ్మెత్త పువ్వు దగ్గరికి వెళ్ళనట్టే నీ మాహాత్మ్యం తెలుసుకున్న వారెవరూ ఇతర మందుల జోలికి వెళ్ళలేరు.
- ఓ అమృతాంజనమా! తాపాన్ని పోగొట్టడం, చల్లదనాన్నివ్వడం, సువాసన వెదజల్లడం, ప్రకాశిస్తూ తెల్లగా ఉండడంవల్ల నిన్ను కల్పవృక్షాలలో ఒకటైన "హరిచందనం"గా భావిస్తాను.
- ఓ అమృతాంజనమా! ప్రపంచంలో ఉన్న ఒక్కొక్క మందులో ఒక్కోరకమైన సుగుణముంటుంది. కానీ లెక్కకు మించి ఎన్నో సుగుణాలు నీలోనే దాగి ఉన్నాయి కదా!
- ఓ అమృతాంజనమా! ఆ హనుమంతుడి పేరు తలుచుకుంటే సమస్త భూతాలు ఎలా భయంతో చెదిరి పోతాయో.. అదేవిధంగా నీ పేరు పలికిన వెంటనే నొప్పులన్నీ మటుమాయమవుతాయి.
- ఓ అమృతాంజనమా! అందరూ నిన్ను ఉపయోగించేటప్పుడు మిగతా మందుల లాగ, మందుతోపాటు చేర్చి పుచ్చుకొనే వస్తువులేవీ అక్కర్లేదు. ఉపయోగించిన తర్వాత కూడా ఎలాంటి పథ్యం పాటించాల్సిన అవసరం లేదు. నీలాంటి అనుకూలమైన ఔషధం మరొకటి ఉంటుందా.?
- ఓ అమృతాంజనమా! పొగడదగిన ప్రబలమైన తిరుగులేని శ్రీరామబాణము లాగ, నిన్ను ఉపయోగించే వారికి వ్యర్థంకాని ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తావు.
- ఓ అమృతాంజనమా! రోగాల నుండి అందరినీ రక్షించడం వలన (గదాయుధంతో సమస్త లోకాలను రక్షించడం వలన), కాశీనాధుని నాగేశ్వరరావు గారి కృషి ఫలితంగా అందరికీ తెలిసినందువలన (ఆదిశేషుడు వహిస్తూ ఉండడం వలన) నిన్ను "హరి" అంటే విష్ణువుగా భావిస్తాను.
- ఓ అమృతాంజనమా! సిద్ధపడి విషాన్ని మింగిన శంకరుడికి నీ అమేయమైన శక్తి తెలిసి ఉంటే ఏ మాత్రం జంకకుండా నిన్ను స్వీకరించి తన కంఠం మీద ఉన్న నల్లని మచ్చని పోగొట్టుకుంటాడు కదా!
- ఓ అమృతాంజనమా! ఎలాంటి వాళ్లైనా సరే వాళ్ళుండే ప్రదేశాల్లో దుర్గంధం ఉంటే.... నిన్ను వాసన చూస్తే చాలు, ఎంతో ఆహ్లాదకరంగా సువాసనలతో వాళ్ళకి ఆనందాన్ని కలిగిస్తావు కదా!
- ఓ అమృతాంజనమా! "కమ్మనైన సువాసనలనిచ్చే మందులు ఈ భూమి మీద అసలు ఉన్నాయా"అనే మాట ఇంక అననక్కర్లేదు. గుభాలించే వాసనతో నువ్వు అందరికీ సుఖప్రదాయినివిగా ఉంటావు కదా.!
- ఓ అమృతాంజనమా! ఎంతో ప్రశస్తమైన ఔషధాలను ధరించిన నీ సుందరమైన రూపము వలన (ఎంతో గొప్పవాడు, పక్షిరాజైన గరుత్మంతుడు ధరించిన సుందరమైన శరీర వైభవం వలన), కాశీనాధుని నాగేశ్వరరావు గారి ప్రయత్నం వలన ఎంతో ఆదరమైన యుక్తవర్తనతో ఉండడం వలన, (ఆజ్ఞలను పాలిస్తూ ఆదిశేషుడు యుక్తవర్తనతో ఆదరంగా ఉండటం వలన) నిన్ను "హరి"గా అంటే విష్ణువుగా భావిస్తాను.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-2 | February 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/advanced/latest/february23_10.php

- ఓ అమృతాంజనమా! సంపన్నుడైన దేవేంద్రుడు నిన్ను చూసి, నీ తత్త్వాన్ని తెలుసుకుంటే గనక, నిన్ను స్వీకరించడా? తన శరీరానికి ఉన్న దౌర్భాగ్యాన్ని తొలిగించుకొని ఉండేవాడు కాదా?

## 7. ఉపసంహారం:

**"బొంబాయిపట్టణమున కేగి యచ్చట విలియం అందుకో స్థాపించి పని చేయుచుండెడివారు. అప్పుడే పంతులుగా రమృతాంజన మును కనిపెట్టిరి. ఆ విధముగ తులుగారు సంపాదించిన యమృతాంజన వ్యాపారమున వివిధ ధనాకర్షణమార్గముల సరయుచు విశేషలబ్ధిని బొందిరి. ఈ యమృతాంజన విక్రయశాల 1894లో స్థాపింపబడినది. ఇట్టి లాభదాయకమగు నమృతాంజన ప్రకటన వ్యాపా రముల కొకపత్రిక యావశ్యకమని గుర్తించి యాలోపమును బూరించుటకై యొశ ముద్రణాలయమును గొనివచ్చి "ఆంధ్రపత్రిక"యను పేరుతో నొక వారపత్రికను స్థాపించి ప్రకటిం చుచు దస్మూలమున గూడ సమితేధనము నార్జించుటకు బ్రారంభించెను, ఆంధ్రభాషయం దానాడు వారపత్రికలు మాత్రమే ప్రకటింపబడుచుండెను. ఈ పత్రికలకంటె నాంధ్రపత్రికయే యుత్తమోత్తమమైనదను ప్రఖ్యాతి నార్జించుకొనినది. ఈ పత్రిక 1908 సంవత్సరమున నెలకొల్పబడినది"** (నాగేశ్వరావు వ్యాసము పుట. 20-21 - జాతీయ నాయకులు- ప్రథమ భాగము.) అనే వాక్యాలు అమృతాంజనం ఆవిర్భావం దాని ప్రచారం కోసం ప్రారంభమైన ఆంధ్రపత్రిక పుట్టుక – ఎదుగుదల గురించి సూచిస్తున్నాయి. ఇంతటి విశేషమైన మహత్తు కలిగిన అమృతాంజనం పై ఆచార్యులవారి శతకం కూడా సహృదయరంజకమై ఆనాటి కాలంలో ఎంతో ఆదరించబడింది. హాస్యశతకంగా, ప్రకీర్ణకశతకంగా, వస్తువైవిధ్యం ఉన్న శతకంగా పాఠకుల మన్ననలు పొందింది.

## 8. ఉపయుక్తగ్రంథసూచి:

1. గిరిజామనోహరబాబు, జి. తెలుగుశతకాలు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువడిన గ్రంథాలు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్, 2012.)
2. చినరఘుపతిరావు, కోటమర్తి. నాగేశ్వరావు వ్యాసము జాతీయ నాయకులు- ప్రథమ భాగము. పుట. 20-21 - 1955)
3. దుర్గాబాయి, దేశముఖ్ (సం.) ఆంధ్రమహిళ సంపుటి 5,6. 1948-11-01
4. నాగభూషణశర్మ, మొదలి. ప్రసాద్, ఏటుకూరి. (సంపా.) కన్యాశుల్కం నూరేళ్ళ సమాలోచనం. గురజాడ అప్పారావు- కన్యాశుల్కము వ్యాసం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్, 1999.
5. నాగేశ్వరరావు, కాశీనాథుని (సం.) ఆంధ్రపత్రిక సంపుటము 20.
6. నారాయణాచార్యుడు, కరి. అమృతాంజనశతకం, ఆంధ్రసాహిత్యగ్రంథమాల, చెన్నపురి, 1932.
7. మల్లికార్జునారాధ్య, మల్లంపల్లి. పురాణము సూర్యనారాయణతీర్థ(సం.) అవతారిక పుట. 3 - సత్యవత్యుపాఖ్యానము 1919
8. శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ షష్ట్యబ్ది పూర్తి సంచిక.
9. ANDHRAPATRIKA, Volume no19, issue no222, Publication date 1932-12-23
10. ANDHRAPATRIKA, Volume no 20, issue no 4, Publication date 1933-04-05

***

**గమనిక: ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.**

**వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.**